# ధనపతి సఖుడై

జంటనగరాలలో బిచ్చగాళ్లు లేకుండా చేస్తామంటూ నాయకులు మరో సారి ప్రకటించినట్లు పత్రికలు ప్రకటించాయి. నిజంగా తినడానికి గతి లేక అడుక్కునే వాళ్లను ఇక్కడ కాకుండా మరో చోటికి తరిమినా వాళ్లకు బిచ్చమెత్తడం మాత్రం తప్పదు. బిచ్చమడుక్కునే వాళ్లు పర్యాటకుల కళ్ల పడకూడదన్నదే పెద్దల ఉద్దేశ్యమయితే ఒకనిజం గుర్తుంచుకోవాలి. పర్యాటకులు ముందుగా కాలు పెట్టే దేశరాజధాని నగరంలోనే ఈ విషయంగా ఎవరూ ఏమీ చేయలేక పోయారు. నిజానికి అక్కడ బిచ్చగాళ్ల సమస్య మరీ అన్యాయంగా ఉంటుంది. నాలుగు రోడ్లు కలిసే ప్రతి కూడలి లోనూ దేశంలోని దారిద్ర్యానికి ప్రతీకల్లాగ ఎముకల పోగులు ప్రత్యక్షమవుతుంటారక్కడ. వారికోసమని పునరావాస కేంద్రాలు మొదలయిన ఏర్పాటు చేసినా నాలుగో రోజున మళ్లా బయట ప్రత్యక్షమవుతారని అనుభవం గల వారు చెపుతుంటారు.

బిచ్చమెత్తడం ఒక కళ. బాహాటంగా బిచ్చమెత్తే వారు ఒకరకమయితే బయట పడకుండా గంభీరంగా అడుక్కునే వారు మరి కొందరుంటారు. ఒకప్పుడొక ముసలాయన ఎదురు పడ్డాడు. చాలా దయనీయంగా మాట్లాడాడు. తన గతం గురించి ఏవేవో చెప్పాడు. అందరకీ మనసు కరిగింది. తలో కొంచెం వేసుకుని మంచి మొత్తమే చేతిలో పెట్టాము. మధ్యాహ్నం భోజనానికని హోటేలుకు వెళితే రెండు మూడు దిన పత్రికలు పక్కన పెట్టుకుని హాయిగా భోజనం చేస్తున్నాడు. శుచిగా భోజనం చేయాలనుకోవడం నిజంగా మంచి లక్షణమని ఒక దిక్కూ మనం కొనవలసిన పత్రికలు ఆయన కొన్నాడని ఇంకో దిక్కూ సంతోషించాము. సాయంకాలం కల్లు పాక పక్కన అదే మనిషి ఒళ్లు తెలియక పడి ఉండడం చూచిన తర్వాత మాత్రం మనసుకు కొంచెం బాధ అనిపించింది. మనిషికి కనీస అవసరాలు తీరిన మరుక్షణం మనసులోనుంచి మరో మనిషి పుట్టుకొస్తాడుగదా అనిపించింది. తిండికి లేని మనిషి దొరికిన పైసలను జాగ్రత్తగా మరో నాలుగు దినాల వరకు వాడుకుంటే బాగుంటుంది గదాని అనిపించింది. మనకు అటువంటి మనిషి కొత్త. ఆయనకు మాత్రం మనలాంటి అమాయకులు నిత్యం దొరుకుతూనే ఉంటారని మాత్రం అప్పుడే తోచినట్టులేదు.

మొన్ననెప్పుడో కాలింగ్‌బెల్ మోగితే వెళ్లి తలుపు తీశాను. ముఖాన రూపాయబిళ్లంతం బొట్టు పెట్టుకుని ఇద్దరు ఆడవాళ్లు కనిపించారు. ఏమిటని అడిగితే అమ్మగారు లేరా అని ప్రశ్న. అమ్మగారికోసం ఎవరెవరో రావడం అలవాటే గనుక

వినయంగా సంగతేమిటని కూడా అడిగాను. అదేదో అమ్మవారికి పూజచేస్తున్నాము. అమ్మగారుంటే రవిక గుడ్డా పసుపు కుంకుమా డబ్బులు ఇస్తారు. నీవు తప్పకుని ఆవిడను ప్రవేశ పెట్టమని ఇంచుమించు ఆదేశించారు. అమ్మగారు ఇంట్లో లేరు, నేను మాత్రం ఇటువంటి దానాలు చేసే మూడ్‌లోలేనని చెప్పడానికి కొంచెం ప్రయత్నం అవసరమయింది. పూజ ఎవరి ఇష్టంకొద్దీ వారు తమ పద్ధతిలో చేసుకోవలసిన సంగతని నా అభిప్రాయం. ఇందులో మరో పద్ధతి కూడా ఉందని నాకు తెలియదు. ఫలానా రోజున ఫలానా తిథి ఏదో వస్తుంది. ఆ రోజున ఫలానా ఊళ్లో ఫలానా దేవుడికి పూజచేయడం చాలా మంచిది. మీరు ఎలాగూ అంతదూరం పోలేరు గనుక మాకు ఇంత సొమ్ము ఇస్తే మీ పక్షాన మేమే ఆ పూజలు జరిపించి ప్రసాదం పంపుతామని కరపత్రాలు కూడా అప్పుడప్పుడు కనిపించాయి. దీనీ గురించి వ్యాఖ్యానిస్తే ఆ అడుక్కుంటున్న వారితో బాటు వారికి దానమిస్తున్నవారికి కూడా కోపం వస్తుందని నాకు తెలుసు.

ఒకాయన పదిరూపాయలు వెచ్చించి ఓ నోటు పుస్తకం కొని బయలుదేరతాడు. అక్కడెక్కడో నీళ్లు రావడంలేదు. అందుకని గుంతలుతోడుతున్నాము. చందా ఇవ్వండని దాష్టీకంగా అడుగుతాడు. మాకూ సరిగా నీళ్లు రావడంలేదు. కానీ గుంతలు తోడడం ఎంతమాత్రమూ సరయిన పద్ధతి కాదు. అటువంటి పని చేయదలుచుకుంటే ఎవరికివారు రహస్యంగా తమ శక్తి కొద్దీ చేసుకోవాలి. ఆ గుంత కారణంగా ఎవరికయితే లాభం కలుగుతుందో వాళ్లే దానికయే ఖర్చును భరించాలి. అడుగుదామంటే ధైర్యం చాలలేదు. తంతాడేమోననిపించింది. ఆ మనిషి అట్లాగున్నాడు. కొంచెం ధైర్యం కూడగట్టుకుని కొంతదాకా అడిగి ఎప్పుడు గుంతలు తోడేదీ చెపితే శ్రమదానం చేస్తాను నా దగ్గర పైసలులేవన్నాను. ఆ మనిషి నా వైపు విసిరిన ఆనాటి చూపు నాకు ఇవాళటికీ గుర్తుకు వస్తుంటుంది.

ఇంకొంత మంది మరో మెట్టు ముందుకు కదిలి ఒక రసీదుపుస్తకం కూడా అచ్చువేయిస్తారు. మహత్తరమయిన లోకోపకారమయిన కార్యక్రమం చేస్తున్నాము. మీరుకూడా అందులో భాగం పంచుకోవడానికి మహదవకాశం కల్పిస్తున్నాము అంటూ ఊదరగొడతారు. వెనకట ఒక పెద్దమనిషి ఈ రకంగా ఏకంగా ఒక సంస్థనే ఏర్పాటుచేసి ఈ పద్ధతిలో లక్షలు సేకరించి మాయమయ్యాడని విన్నాము. అందుకే ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు కూడా చేయదలుచుకున్న దానమేదో సరయిన సంస్థల ద్వారా చేయమని పెద్దలు చెపుతూనే ఉంటారు.

అడుక్కోవడంలో అన్నిటికన్నా ఆశ్చర్యకరమయిన పద్ధతిని దిల్లీ నగరంలో చూచాను. అక్కడ కొందరు గోసాయీ దుస్తులు వేసుకుని తిరుగుతుంటారు. వాళ్లచేతుల్లో లేదంటే మెడ మీద కొండచిలువ మొదలు రకరకాల పాములు ఒకటో రెండో ఉంటాయి. ఒంటరిగా కనిపించిన

మనిషి దగ్గరకు వచ్చి ఆ పాముల్లో ఒక దాన్ని మరీ దగ్గరగా మొహం ముందు పెట్టి నాగరాజు దానమడుగుతున్నాడంటారు. ఎదుటి మనిషి భయపడుతున్నట్లు గమనిస్తే చాలు ఆ పామును అమాంతంగా మెడలో పడేసి డబ్బు లాక్కున్న సంఘటనలూ తెలుసు. ధనవంతులుండే ఒక ప్రాంతంలో ఈ పద్ధతితో ఒకాయన దగ్గర మరీ పెద్ద మొత్తం లాక్కుపోయారుకూడా. నాకు వ్యక్తిగతంగా ఇటువంటి సంఘటన ఒకటి ఎదురయింది. ఒక రూపాయ ఇవ్వబోయాను. జేబులోంచి బయటకు తీసిన డబ్బు వాడి కళ్లబడింది. తిరిగి ఇచ్చేస్తానని ఏదో చెపుతూ ఆ డబ్బులన్నీ లాక్కున్నాడు. నోట్లను పాముపోటిలో కుక్కడం మొదలు పెట్టాడు. నేను గట్టిగా అరిచే సరికి నలుగురు పోగయ్యారు. వాడు నా డబ్బులు నాకు ఇచ్చేశాడు. తీసుకున్న డబ్బు పరమేశ్వరుడికి చేరిందట. అందుకే తిరిగి అడగడం పాపమట. ఒంటరిగానూ జన సమ్మర్దం లేని చోటనూ అయితే ఆ డబ్బులు వాడన్నట్టే పరమేశ్వరుడికి దత్తం అయ్యేవి. దేవుడికి డబ్బులివ్వాలనే గనుక అనుకున్న వారికి కూడా మరో మంచి మార్గం ఉంటుంది కదా!

ధనపతి సఖుడైనా శివుడు బిచ్చమెత్తవలని వచ్చిందని పద్యం ఒకటి ఉంది. మిత్రుని దగ్గర ఉన్నా అది మనం అడగాలని లేదు. వారు మనకు ఇవ్వాలనీ లేదు. మన అవసరం తీరడానికి సరయిన తీరేదో మనమే ఎంచుకోవాలి. పెట్టుబడి లేని వ్యాపారం బిచ్చమెత్తడమని ఎవరో అనగా విన్నాను. బిచ్చగాళ్లు అప్పులు కూడా ఇస్తుంటారట. వారి తీరు ఒకటయితే రకరకాలుగా భయ పెట్టి బిచ్చం అడుక్కునే వారి తీరు మరొకటి. వీళ్లను గురించి ఎవరయినా పట్టించుకుంటే బాగుండును!